సాక్షి ఒడిశా

గురువారం । 8 । జూన్ । 2023



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

భువనేశ్వర్: పూరీ జగన్నాథాలయంలో భక్తులు కానుకల రూపంలో సమర్పించిన హుండీ ఆదాయాన్ని ఆలయ పాలకవర్గం వారం లెక్కించారు. ఇందులో నగదు రూ.77,121లు వచ్చాయని అధికారులు వెల్లడించారు.



కన్నవారింటికి అమ్మవారు

-8లో▸



విద్యుతో సమూల మార్పులు

-8లో▸

న్యూస్‌రీల్

పడవ బోల్తా.. ఇద్దరు గల్లంతు



చిత్రకొండ జలాశయంలో గాలిస్తున్న ఓడ్రాఫ్ బృందం

మల్కన్‌గిరి: జిల్లాలోని ఖొయిర్‌పుట్ సమితి అండ్రాహల్ పంచాయతీ సింధిగూడ గ్రామం వద్ద పడవలో బోల్తా పడి, ఇద్దరు బాలలు గల్లంతయ్యారు. ఖొయిర్‌పుట్ చెందిన సంజిత్ కిడాంగి(17), బాలరామ్ కిడాంగి(15) కుటుంబ సభ్యులతో కలిసి చిత్రకొండ జలాశయం అవతలి వైపు ఉన్న పడాల్‌పుట్ గ్రామంలో జరుగుతున్న వివాహానానికి సోమవారం ఉదయం నాటు పడవలో వెళ్లారు. మంగళవారం సాయంత్రం తిరిగి తిరిగి వస్తుండగా ఒక్కసారిగా పడవ బోల్తా పడింది. దీంతో అంతా గల్లంతా కాగా.. దీనిపై గ్రామస్తులు ఖొయిర్‌పుట్ అగ్నిమాపక కార్యాలయానికి సమచారం అందించారు. సిబ్బంది అక్కడికి చేరుకొని గాలించినా ప్రయోజనం లేకపోయింది. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు.

18, 19 తేదీల్లో మాక్‌డ్రిల్



సమీక్షలో మాట్లాడుతున్న ఏడీఎంలు రాజేంద్ర మింజ్, బీరేంద్రకుమార్

పర్లాకిమిడి: జిల్లాలో ప్రకృతి విపత్తుల సమయంలో చేపట్టాల్సిన ముందస్తు చర్యలపై సన్నాహక సమావేశంలో కలెక్టర్ కార్యాలయంలో బుధవారం నిర్వహించారు. జిల్లా అదనపు మేజిస్ట్రేట్ రాజేంద్ర మింజ్, అదనపు కలెక్టర్(రెవెన్యూ) బీరేంద్రకుమార్ దాస్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో జిల్లా అత్యవసర అధికారి ప్రభాస్‌కుమార్ బెవురా, కాశీనగర్, నువాగడ, రాయఘడ బీడీఓలు, తహసీల్దార్లు, గ్రామీణ తాగునీరు, పారిశుద్ధ్య, పోలీసు, అగ్నిమాపక శాఖల అధికారులు హాజరయ్యారు. ఈనెల 18,19 తేదీల్లో జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో మాక్‌డ్రిల్, టేబుల్ టాప్ ఎక్సర్‌సైజ్ నిర్వహించనున్నట్లు తెలిపారు. విపత్తుల అవగాహన అధికారి ప్రదోష్‌కుమార్ శత్పతి మాట్లాడుతూ తుపాను, కరువు, గాలివానల నష్టాలను నివారించేందుకు తగు చర్యలు చేపట్టాలని పిలుపునిచ్చారు.

మదన్ పట్నాయక్‌కు ఘనంగా వీడ్కోలు



మదన్ పట్నాయక్‌కు సత్కరిస్తున్న రైల్వే శ్రామిక్ కాంగ్రెస్ కార్యకర్తలు

భువనేశ్వర్: తూర్పుకోస్తా రైల్వే జనరల్ మేనేజర్(న్యాయ శాఖ)గా ఉద్యోగ విరామణ పొందిన మదన్ పట్నాయక్‌ను బుధవారం ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన స్వగ్రామం ఖుర్దారోడ్ కుదియారి గ్రామంలో ప్రత్యేక సభను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయనను సతీసమేతంగా గ్రామస్తులు సత్కరించి అభినందించారు. బాల్యం నుంచి మదన్ పట్నాయక్ మేధావి విద్యార్థిగా గ్రామంలో గుర్తింపు పొందారు. రైల్వేలో సాధారణ ఉద్యోగి(స్టేషన్ మాస్టర్)గా చేరి అంచెలంచెలుగా ఎదిగారు. 25 ఏళ్ల సుదీర్ఘ ఉద్యోగ జీవితంలో ఏఓఎం, విజిలెన్స్ అధికారి, డీఓఎం, జనరల్ మేనేజర్(న్యాయ శాఖ)గా పదోన్నతులు సాధించారు. తూర్పుకోస్తా రైల్వే పదోన్నతి అధికారుల సంఘం ప్రధాన కార్యదర్శిగా దీర్ఘకాలం బాధ్యతలు నిర్వహించారని శ్రామిక్ కాంగ్రెస్ మీడియా సమన్వయకర్త లక్ష్మీధర మహంతి తెలిపారు.

పర్లాకిమిడి క్రీడాకారుడికి కలెక్టర్ అభినందన



నిరంజన్‌ను అభినందిస్తున్న కలెక్టర్

పర్లాకిమిడి: పట్టణంలోని కంద్రవీధికి చెందిన బాక్సర్ నిరంజన్ అకుల్ మే 21న రౌర్కెలాలో జరిగిన బాక్సింగ్ పోటీల్లో సత్తాచాటాడు. ఒడిశా అమాచ్యుయర్ బాక్సింగ్ అసోసియేషన్ తరఫున హాజరై, జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. ఈ సందర్భంగా కలెక్టర్ లింగరాజ్ పండా తన కార్యాలయంలో క్రీడాకారుడిని బుధవారం అభినందించారు. అలాగే కోచ్ రామకృష్ణ బెనియాను ప్రశంసించారు. ఢిల్లీలో జరగనున్న జాతీయ చాంపియన్‌షిప్‌కు వెళ్లేందుకు తగు సహకారం అందిస్తామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ నృసింహచరణ్ పట్నాయక్ తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న దర్యాప్తు

- బహనాగా బజార్ రైలు ప్రమాద స్థలాన్ని పరిశీలించిన సీబీఐ అధికారులు
- ప్రత్యక్షంగా విధుల్లో ఉన్న సిబ్బంది నుంచి సెల్‌ఫోన్లు స్వాధీనం
- సీఆర్‌ఎస్ విచారణలో 55మందికి నోటీసులు
- సిగ్నల్ వ్యవస్థలో తప్పదం లేనట్లుగా ప్రాథమిక అంచనా



దర్యాప్తు నిమిత్తం బహనాగా బజార్ రైల్వేస్టేషన్‌కు వస్తున్న సీబీఐ అధికారులు

ఎయిమ్స్‌లో మృతదేహాలు భద్రం..



బహనాగా బజార్ రైలు ప్రమాదానికి గురైన బంధువులు మృతదేహాలను గుర్తించేందుకు వెతుకులాట పని లేదు. వీరి సౌలభ్యం కోసం స్థానిక ఎయిమ్స్ ప్రాంగణంలో మృతదేహాలను భద్రపరిచి, సమగ్ర సమాచారం అందజేస్తున్నారు. మృతుల గుర్తింపు కోసం ఆత్మీయులు మరే ఇతర ఆస్పత్రికి వెళ్లాల్సిన అవసరం లేదని బుధవారం స్పష్టంచేశారు. అయితే.. కొన్ని మృతదేహాల కోసం ఒక్కరు కూడా ముందుకు రాకపోగా.. మరికొన్నిటికి ఎక్కువ మంది ముందుకు రావడంతో గందరగోళం నెలకొంది. దీని నివారణ కోసం డీఎన్‌ఏ పరీక్ష నిర్వహించాలని నిర్ణయించారు. ఈ నేపథ్యంలో 33నమూనాలను పరీక్షల నిమిత్తం ఢిల్లీకి పంపించారు. నివేదిక ఆధారంగా మృతదేహాల్ని బంధు వర్గాలకు అందజేస్తారు.

భువనేశ్వర్: బాలాసోర్ జిల్లా బహనాగా బజార్ రైల్వే స్టేషన్‌లో ఈనెల 2న జరిగిన ట్రిపుల్ రైలు దుర్ఘటనపై సీబీఐ దర్యాప్తు నిరవధికంగా కొనసాగుతోంది. ఈ దుర్ఘటన 288మంది ప్రాణాల్ని బలి తీసుకోగా.. వెయ్యి మందికి పైగా గాయపడి ఆస్పత్రి పాలైన సంగతి తెలిసిందే. దుర్ఘటన పూర్వాపరాలను తెరపైకి తెచ్చేందుకు సీబీఐ దర్యాప్తు బృందం బహుముఖ కోణాల్లో దర్యాప్తును బలపరుస్తున్నారు. ఘటనా స్థలం తరచూ సందర్శిస్తున్నారు. బుధవారం దాదాపు 45 నిమిషాలు ఈ ప్రాంగణంలో దర్యాప్తు కొనసాగించారు. ఘటనా స్థలాన్ని సీబీఐ సందర్శించడం ఇది మూడోసారి. అధికార వర్గాలతో సాంకేతిక, ఫోరెన్సిక్ బృందం బహనాగా బజార్ ప్రమాద స్థలాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా కొంతమంది రైల్వే సిబ్బంది సెల్‌ఫోన్ లను స్వాధీనం చేసుకున్నారు. సిబ్బంది కాల్ రికార్డులు, వాట్సాప్, సోషల్ మీడియా చాట్‌లను సేకరిస్తున్నట్లు సంబంధిత వర్గాల సమాచారం. ఫోరెన్సిక్, సాంకేతిక నిపుణులతో కలిసి సీబీఐ బృందం మెయిన్ లైన్, లూప్‌లైన్, దుర్ఘటన ప్రాంతం, సిగ్నలింగ్ రూమ్, స్టేషన్ మాస్టర్ కార్యాలయాన్ని పరిశీలించారు.

పైలట్‌లపై దృష్టి..

కోరమండల్ ఎక్స్‌ప్రెస్ భయానక దుర్ఘటన తొలి దృశ్యాలను ప్రత్యక్షంగా చవిచూసిన లోకో పైలట్‌ల వైపు దర్యాప్తు వర్గాలు దృష్టి సారిస్తున్నాయి. ఇరువురు పైలట్ల వాంగ్మూలం దుర్ఘటన ప్రత్యక్ష సాక్షుల వర్గంలో అత్యంత కీలకం. దీని ఆధారంగా దుర్ఘటన వెనుక గాలిస్తున్న స్థితిగతుల పూర్వాపరాలకు సంబంధించి బలమైన ఆధారాలు ధ్రువీకరించడం సాధ్యం అవుతుంది. మరోవైపు రైల్వే భద్రతా కమిషనర్ విచారణ ఈ దుర్ఘటనలో అత్యంత కీలకం. దుర్ఘటన పూర్వాపరాలతో ఏమాత్రం అనుసంధానం కలిగి ఉన్న ఆయా వర్గాల సిబ్బంది, అధికారులతో సాధారణ వర్గాల వాంగ్మూలం నమోదు చేసి ఈ వర్గం విచారణ పటిష్ట పరుస్తోంది. అత్యంత నిష్పక్షపాతంగా ఈ విచారణ నిజానిజాలను వెలుగులోకి తెస్తుందని సర్వత్రా నమ్మకం వ్యక్తం అవుతోంది. ఈ నేపథ్యంలో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న లోకో పైలట్ల వాంగ్మూలం నమోదు చేశారు. ఈ బాటలో సీబీఐ అధికారులు వీరిని విచారించే దిశలో అడుగులు వేస్తున్నారు. మృత్యు కోరల నుంచి బయటపడిన పైలట్ల వాంగ్మూలం దుర్ఘటన అంతు తేలడంలో ప్రధాన సోపానంగా నిలుస్తోంది. తీవ్రంగా గాయపడిన లోకోపైలట్, సహాయ లోకోపైలట్ స్థానిక ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. వీరిలో 36 ఏళ్ల సహాయ లోకోపైలట్ హజారీ బెహరా ఆరోగ్యం కొంతమేరకు కోలుకుని విచారణకు సహకరించే స్థాయిలో ఉన్నట్లు సమాచారం. ఆయనతో సంప్రదించేందుకు దర్యాప్తు వర్గాలు సన్నాహాలు చేస్తున్నట్లు తెలిసింది. వీరివురితో కుటుంబీకులు వంటి ప్రముఖ వర్గాలు మినహా ఇతరులు కలిసేందుకు వీలు లేకుండా గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. వీరితో కలిసేందుకు వచ్చి పోతున్న వారి పూర్తి వివరాల పట్ల భద్రతా బలగాలు ప్రత్యేకంగా దృష్టి సారించాయి.

సహాయ లోకో పైలట్‌కు క్లీన్‌చిట్..

దుర్ఘటనకు గురైన కోరమండల్ ఎక్స్‌ప్రెస్ రైలు సహాయ లోకో పైలట్ హజారి బెహరా తప్పిదం ఏమీ లేనట్లు రైల్వేబోర్డు ధ్రువీకరించినట్లు విశ్వసనీయ సమాచారం. పరిమిత వేగంలో రైలు నడపడం, నిబంధనల మేరకు సిగ్నల్ వ్యవస్థకు అనుగుణంగా ముందుకు దూసుకుపోవడం వంటి కార్యాచరణలో ఎటువంటి తప్పిదం లేనట్లు ప్రాథమిక విచారణ ధ్రువీకరణగా తెలిసింది. అపరిమిత వేగం, సిగ్నల్‌ను అధిగమించడం వంటి కార్యాచరణ ఇటువంటి సందర్భాల్లో లోకో పైలట్ల తప్పిదంగా పరిగణించి తదనుగుణంగా కఠిన చర్యలు చేపడతారు. ఈ సమాచారం దృష్ట్యా లోకోపైలట్ ఆధ్వర్యంలో రైలు పరుగులు తీయించడంలో సహాయ లోకోపైలట్ పనితీరు ముడిపడి ఉంటుంది. సహాయ లోకో పైలట్ పనితీరు పట్ల సంతృప్తి వ్యక్తం కావడంతో లోకోపైలట్ గుణనిధి మహంతికి విధి నిర్వహణలో క్లీన్‌చిట్ లభించే అవకాశం ఉంది.

ప్రమాదం ఎలా జరిగింది..

రైలు చోదకుల్లో లోపం లేని పరిస్థితుల్లో ప్రమాదం ఎలా జరిగిందనే కీలక ప్రశ్న సర్వత్రా కలకలం రేపుతోంది. సిగ్నలింగ్‌తో ముడిపడిన లైన్ మార్పిడి రైలు గమనాగమనాలను నిర్ధారిస్తుంది. అప్‌లైన్‌లో నేరుగా పోవాల్సిన కోరమండల్ ఎక్స్‌ప్రెస్ రైలు లూప్‌లైన్‌లో నిలిచి ఉన్న గూడ్స్ రైలుని ఢీకొనడం నిగ్గు తేలాల్సి ఉంది. ఈ సమగ్ర ప్రక్రియతో ముడిపడిన అన్ని వర్గాల సిబ్బందిని రైల్వే భద్రతా కమిషనర్ విచారణకు పిలుపునిచ్చి వాంగ్మూలం నమోదు చేశారు. సీబీఐ దర్యాప్తు ఇంతవరకు క్షేత్రస్థాయికే పరిమితమైంది. బాలాసోర్ ప్రభుత్వ రైల్వే పోలీసులు(జీఆర్‌పీ) నమోదు చేసిన ప్రాథమిక ఫిర్యాదు(ఎఫ్ఐఆర్) ఆధారంగా 10మంది సభ్యుల కేంద్ర దర్యాప్తు బృందం సీబీఐ ఘటనా స్థలం సందర్శించి పరిశీలిస్తుంది. ఈ నేపథ్యంలో బహనాగా బజార్ రైల్వేస్టేషన్, స్టేషన్ మేనేజర్ కార్యాలయంలో ప్యానెల్ రూమ్, రికార్డ్ రూమ్, రిలే రూమ్‌లను సందర్శించి అక్కడ ఉన్న సిబ్బందిని ఈ బృందం ప్రశ్నించింది.

విధ్వంసకర దుశ్చర్యగా ప్రచారం..

కోరమండల్ ఎక్స్‌ప్రెస్ సురక్షిత రవాణాకు సంబంధించి అనుబంధ సిబ్బంది స్థాయిలో ఎటువంటి లోపం తారసపడని పరిస్థితుల్లో ఘోరాతి ఘోరమైన దుర్ఘటన సంభవించడం విధ్వంసకర చర్యగా భావిస్తున్నారు. దీనివెనుక అదృశ్య హస్తం ఉంది. నిగ్గు తేలాల్సిందేనని సర్వత్రా చర్చ సాగుతోంది. మరోవైపు ఈ విషయం రాజకీయ దుమారం ప్రేరేపిస్తోంది. నేర చర్యగా సంబంధించి కారణాలు, పరిస్థితుల్ని లోతుగా దర్యాప్తు జరిపి నిజానిజాలను వెలికి తీయడంలో సీబీఐ వర్గం, పట్టాలపై రైలుని సురక్షితంగా పరుగులు తీయించడంలో సిబ్బంది అనుబంధ యంత్రాంగం పాత్రను ఆరా తీయడంలో రైల్వే భద్రతా కమిషనర్(సీఆర్‌ఎస్) విచారణ దోహదపడతాయి. ఇప్పటికే విచారణ కోసం సీఆర్‌ఎస్ 55మందికి పిలుపునిచ్చింది. ఎంఎం చౌదరి రైల్వే భద్రతా కమిషనర్ ఆధ్వర్యంలో ఆగ్నేయ రైల్వే ఖరగ్‌పూర్‌లో ఈ విచారణ చేపట్టారు.

అపురూప ఆనందం..

- ఆత్మీయులను దగ్గర చేస్తున్న హెల్ప్‌డెస్క్‌లు
- ఎస్సీబీ మెడికల్ కళాశాలలో కన్నీటి గాథలు

భువనేశ్వర్: బాలాసోర్ జిల్లా బహనాగా బజార్ రైల్వేస్టేషన్ కోరమండల్ ఎక్స్‌ప్రెస్ రైలు దుర్ఘటన తదనంతర పరిణామాలు విభిన్న కోణాల్లో ప్రతిబింబిస్తున్నాయి. కొన ఊపిరితో కొట్టుమిట్టాడుతూ చికిత్స పొందుతున్న వారి ఆత్మీయుల ఆచూకీ లభించని వారు కొందరైతే.. దుర్మరణం పాలైన సందర్భంలో తీరని గడ్డు పరిస్థితుల్లో మృత హాలు అయిన వారి రాకకోసం నిరీక్షిస్తున్నాయి. ఈ విచారకర పరిస్థితులను అధిగమించేందుకు చికిత్స, వైద్యం, సాంకేతిక పరిజ్ఞానంతో పలు ప్రత్యామ్నాయ ప్రయత్నాలు ఫలిస్తున్నాయి. ప్రధానంగా దుర్ఘటన భయానక దృశ్యాలు, పరిస్థితులు కళ్ల ముందు మెసలుతున్న భయంకర పరిస్థితుల నుంచి బాధితులను ఆదుకునేందుకు మానసిక తత్వ బోధనలు, ఆత్మీయ అనురాగాలతో క్రమంగా సాధారణ స్థితికి తీసుకుని వచ్చే ప్రయత్నాలు ముమ్మరంగా సాగుతున్నాయి. మరోవైపు సంప్రదింపుల వ్యవస్థను పటిష్ట చేసి, మారుమూల ప్రాంతాల వరకు ఆత్మీయుల కోసం నిరీక్షిస్తున్న అభాగ్యుల వివరాలను ప్రసారం చేసే హెల్ప్‌డెస్క్ వ్యవస్థ అద్భుతమైన ఫలితాలు సాధిస్తోంది. ఈ నేపథ్యంలో కటక్ ఎస్సీబీ మెడికల్ కళాశాల ఆస్పత్రిలో పడి ఉన్న ఇద్దరి బాధితుల ఆత్మీయులు.. ప్రాణాపాయ పరిస్థితిలో చికిత్స పొందుతున్న తమ వారిని అక్కున చేర్చుకుని కృతజ్ఞతా పూర్వకంగా కన్నీరు కార్చారు.

తల్లిదండ్రులకు సమాచారం..



కటక్ ఎస్సీబీ మెడికల్ కళాశాల ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఈ బాలుడు బాలేశ్వర్ రైలు దుర్ఘటనలో బాధితుడు 15 ఏళ్ల రామానంద్ పాశ్వాన్. నేపాల్ ప్రాంతీయుడు. దుర్ఘటనపాలైనప్పటికీ తన తల్లిదండ్రులు ఇతరేతర వివరాలకు సంబంధించి బలమైన సమాచారం అందజేయడంతో ఇక్కడ ఏర్పాటు చేసిన హెల్ప్‌డెస్క్ ద్వారా కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. ఈ మేరకు వారు తమ బిడ్డను కలుసుకునే ఏర్పాట్లు చేశారు. ఘోరమైన ఈ దుర్ఘటనలో బిడ్డను నిండు ప్రాణాలతో చూడగలగడం అద్భుతమని రామానంద్ పాశ్వాన్ తల్లిదండ్రులు భావోద్వేగం వ్యక్తం చేశారు.

పెళ్లయిన 3 రోజులకే..



మహ్మద్ రఫీక్, దీపిక పాలి ఘటనకు 3 రోజుల క్రితం పెళ్లి చేసుకుని విశాఖపట్నం బయల్దేరారు. షాలీమార్ నుంచి వీరు ప్రయాణిస్తున్న కోరమండల్ ఎక్స్‌ప్రెస్ రైలు దుర్ఘటన పాలవ్వడంతో ఇరువురూ చెల్లాచెదురయ్యారు. తీవ్రంగా గాయపడిన పరిస్థితిలో సహాయక వర్గాలు ఆదుకుని కటక్ ఎస్సీబీ మెడికల్ కాలేజ్ ఆస్పత్రిలో చేర్చారు. వేర్వేరు వార్డుల్లో చికిత్స పొందుతున్న వీరిని హెల్ప్‌డెస్కు వర్గాలు గుర్తించి, ఒక చోటకు చేర్చి చికిత్స కొనసాగిస్తున్నారు. అత్యంత భయానక దుర్ఘటన నుంచి బతికి బట్టకట్టడంతో ఉభయులం ఏకం కాగలగడం ఎంతో అదృష్టమని ఈ జంట మురిసిపోతుంది.

బాధితులకు ఉద్యోగం, ఉచిత విద్య..





అచ్యుత సామంత్

బహనాగా బజార్ ట్రిపుల్ రైలు దుర్ఘటనలో మృతుల కుటుంబ సభ్యులకు ఉద్యోగాలు, ఉచిత విద్య సౌకర్యం కల్పించేందుకు భువనేశ్వర్ లోని కిట్, కిస్ సంస్థల వ్యవస్థాపకులు డాక్టర్ అచ్యుత సామంత్ బుధవారం ప్రకటించారు. 'రైలు ప్రమాదంలో మరణించిన వారి కుటుంబ సభ్యుల బాధను తగ్గించలేం. కానీ వారిని ఆదుకోవడానికి మేము మా స్థాయిలో ప్రయత్నిస్తాం. అర్హత ఆధారంగా మరణించిన వారి కుటుంబంలోని ఒక సభ్యుడికి కిట్ లేదా కిస్ సంస్థలో ఉద్యోగావకాశం కల్పిస్తా'మని తెలిపారు. రైలు ప్రమాదంలో తల్లిదండ్రులను కోల్పోయిన పిల్లలకు విశ్వవిద్యాలయంలో ఒకటో తరగతి నుంచి ఉన్నత స్థాయి వరకు వారి ఉచిత విద్యను అందిస్తామని భరోసా ఇచ్చారు. ఉద్యోగం, ఉచిత విద్య కోసం ఎలా దరఖాస్తు చేయాలో బాధితులకు తెలియజేస్తామన్నారు. కోరమాండల్ ఎక్స్‌ప్రెస్, బెంగుళూరు–హౌరా సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్, గూడ్స్ రైలుతో కూడిన భయంకరమైన రైలు ప్రమాదంలో ఒడిశాకు చెందిన 39మంది ప్రాణాలు కోల్పోయారు.

రక్తదానంతో ప్రాణదానం

- దక్షిణాంచల్ డీఐజీ సత్యబ్రత బొయి



రక్తదానం చేస్తున్న జర్నలిస్టులు

బరంపురం: ఆపదలో ఉన్నవారికి రక్తదానం చేసి, ప్రాణదాతలుగా నిలవాలని దక్షిణాంచల్ డీఐజీ సత్యబ్రత బొయి పిలుపునిచ్చారు. నగరంలోని ఎస్‌బీఐ మెయిన్ బ్రాంచ్ రోడ్డులో ఉన్న బరంపురం ప్రెస్‌క్లబ్‌లో బుధవారం నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని ఆయన ప్రారంభించి, మాట్లాడారు. వివిధ సమయాల్లో క్షతగాత్రులు, ప్రాణాపాయ స్థితిలో ఉన్నవారు సకాలంలో రక్తం లభించక ప్రాణాలు కోల్పోతున్నారని గుర్తించారు. ఇటువంటి శిబిరాల ద్వారా రక్తం సేకరించి, అటువంటి వారికి అందించడం ద్వారా ప్రాణాలు కాపాడవచ్చని తెలిపారు. ఈ సందర్భంగా రక్తదానం చేసిన జర్నలిస్ట్ లను ఆయన అభినందించారు. శిబిరంలో వివిధ మీడియా సంస్థలకు చెందిన ప్రతినిధులు పాల్గొన్నారు.



శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఐజీ సత్యబ్రత బొయి

కాటేసిన మృత్యువు

- గాలివానతో రైలు వ్యాగన్ కింద తలదాచుకున్న కార్మికులు
- పెనుగాలుల ధాటికి బోగీలు ముందుకు కదలడంతో ఆరుగురి మృతి



ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న అధికారులు



ఘటనా స్థలంలో గుమిగూడిన స్థానికులు

భువనేశ్వర్: మృత్యువు ఏ రూపంలో ఎవరిని కాటేస్తుందో ఊహాతీతం. ఈ ఘటన దీనికి నిలువెత్తు తార్కాణం. బహనాగా బజార్ రైల్వేస్టేషన్ దుర్ఘటనతో కోలుకోక ముందే మరో విషాదం చోటు చేసుకోవడం సర్వత్రా విచారం అలముకుంది. జాజ్‌పూర్–కెంజొహర్ రోడ్ రైల్వేస్టేషన్‌లో బుధవారం ఈ దుర్ఘటన చోటు చేసుకుంది. ఇందులో ఆరుగురు కార్మికులు దుర్మరణం పాలయ్యారు. మరొకరు తీవ్ర గాయాలతో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. వివరాల్లోకి వెళ్తే... బుధవారం సాయంత్రం 5.15 గంటల సమయంలో జాజ్‌పూర్–కెంజొహర్ రోడ్ రైల్వేస్టేషన్ ప్రాంతంలో కాలవైశాఖి వాతావరణం తాండవించింది. దీంతో పెనుగాలులతో భారీ వర్షం కురవడంతో తల దాచుకునేందుకు రైల్వే ట్రాక్ పరిసరాల్లో పని చేస్తున్న కార్మికులు తల దాచుకునేందుకు గూడ్సురైలు వ్యాగన్ కింద తల దాచుకునేందుకు దూరారు. అత్యవసరాల కోసం సిక్‌లైన్ ప్రాంగణంలో నిలిపి ఉంచిన వ్యాగన్‌గా తూర్పుకోస్తా రైల్వే అధికార వర్గాలు తెలిపాయి. ఇంజిన్ లేకుండా ఈ వ్యాగను ట్రాక్‌పై నిలబడి ఉంది. ఆకస్మిక వాతావరణ మార్పుతో కాలవైశాఖి అలముకుంది. బలంగా వీచిన గాలుల ప్రభావంతో నిలకడగా నిలిచి ఉన్న వ్యాగన్ ఊహించని రీతిలో ముందుకు కదిలింది. కార్మికులు తలదాచుకునేందుకు దూరిన మరుక్షణంలో ఈ విపత్కర పరిస్థితి చోటు చేసుకోవడంతో ప్రాణాపాయ ఉచ్చులో బిగుసుకున్నారు. అకస్మాతుగా బయటకు రాలేని దయనీయ పరిస్థితుల్లో వర్షం నుంచి రక్షణ పొందేందుకు తల దాచుకున్న వ్యాగన్ చక్రాల కింద చితికిపోయి కార్మికులు దుర్మరణం పాలయ్యారు. వ్యాగను కదలికను పసిగట్టిన క్షణంలో సమయ స్ఫూర్తితో బయటపడే ప్రయత్నంలో ముగ్గురు గాయాలపాలయ్యారు. ఇందులో ఇద్దరు చికిత్స పొందుతూ మరణించారు. బాధితులు రైల్వే కాంట్రాక్టు పనుల కోసం నియమితులైన కార్మికులుగా గుర్తించారు. ప్రాణాపాయ స్థితిలో బాధితులను చేరువలో ఉన్న ఆస్పత్రిలో చికిత్స కోసం చేర్చారు. ఖుర్దారోడ్ డివిజన్ రైల్వే అధికారి(డీఆర్ఎం) రింకేష్‌రాయ్ ఆధ్వర్యంలో పలువురు అధికారుల బృందం ఘటనా స్థలాన్ని సందర్శించి, దుర్ఘటన పూర్వాపరాలను సమీక్షిస్తున్నారు.

రూ.5 లక్షల పరిహారం

జాజ్‌పూర్–కెంజొహర్ రోడ్ రైల్వేస్టేషన్‌లో బుధవారం సాయంత్రం జరిగిన గూడ్సు వ్యాగన్ ప్రమాదంలో మృతిచెందిన ఘటన పట్ల ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మృతులకు పరిహారం ప్రకటించారు. బాధిత కుటుంబాలకు ఒక్కొక్కరికీ రూ.5 లక్షల చొప్పున సీఎం సహాయ నిధి(సీఎంఆర్ఎఫ్) నుంచి నిధులు విడుదల చేయనున్నట్లు తెలిపారు. మృతుల పట్ల ప్రగాఢ సానుభూతి తెలిపిన నవీన్.. ప్రమాదంలో గాయపడిన వారికి తగిన వైద్యం అందించాలని ఆదేశించారు. వీరంతా త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

క్లుప్తంగా

త్రుటిలో తప్పిన పెను ప్రమాదం



లారీ ఢీ కొనడంతో నేలకొరిన కరెంట్ పోల్

పార్వతీపురంటౌన్: జిల్లా కేంద్రం పార్వతీపురం పట్టణంలో పెనుప్రమాదం తప్పింది. వివరాలిలా ఉన్నాయి. బుధవారం ఒడిశా నుంచి విశాఖపట్నం వెళ్తున్న లారీ బైపాస్ రోడ్డు వద్ద హై టెన్షన్ కరెంట్ పోల్‌ను ఢీకొట్టింది. ఈ ఘటనలో పోల్ విరిగి నేలకొరిగింది. వేకువ జామున 3:30 గంటల సమయంలో ఈ ఘటన జరగడంతో పెనుప్రమాదం తప్పిందని విద్యుత్ శాఖ ఏఈ రామారావు చెప్పారు. రహదారిపై ఆ సమయంలో ఎవరూ లేకపోవడంతో అదృష్టవశాత్తు ఎటువంటి ప్రాణనష్టం జరగలేదని, పునరుద్ధరణ పనులు చేపట్టినట్లు తెలిపారు.

ఉపాధ్యాయ బదిలీల్లో ఖాళీలను బ్లాక్ చెయ్యొద్దు

విజయనగరం పూల్‌బాగ్: ఉపాధ్యాయ బదిలీల్లో ఖాళీలను బ్లాక్ చెయ్యొద్దని యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు జేఆర్‌సీ పట్నాయక్, ప్రధాన కార్యదర్శి ఈశ్వరరావు డిమాండ్ చేశారు. ఈ మేరకు డీఈఓ కార్యాలయం వద్ద యూటీఎఫ్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో బుధవారం ధర్నా చేపట్టారు. కార్యక్రమంలో రాష్ట్ర కౌన్సిలర్ కె.శ్రీనివాసరావు, జిల్లా కార్యదర్శులు వి. వాసుదేవరావు, కె.ప్రసాదరావు, జి.రాజారావు, ఆనంద్, శోభన్‌బాబు, రామకృష్ణ పాల్గొన్నారు.

తోటలో అగ్ని పిడుగు

చీపురుపల్లి రూరల్(గరివిడి): గరివిడి మండలంలోని దుమ్మెద గ్రామానికి వెళ్లే రహదారిలో గల తోటలో అగ్నిపిడుగు పడి పెద్ద మంటలు ఎగిసిపడ్డాయని ఎస్సై ఎల్.దామోదరరావు తెలిపారు. ఈ మేరకు మండలంలో బుధవారం సాయంత్రం గాలులతో కూడిన వర్షం కురిసింది. ఈ క్రమంలో తోటలో పెద్ద పిడుగు పడింది. అదే సమయంలో అటువైపుగా వెళ్తున్న ఎస్సై దామోదరరావు పిడుగుపాటు సమాచారం తెలుసుకుని వెంటనే ఫైర్‌స్టేషన్‌కు సమాచారం అందించారు.అదే విధంగా పిడుగు పడే ప్రాంతంలో 33కేవీ విద్యుత్‌లైన్ కూడా ఉండడంతో ఇదే విషయంపై విద్యుత్‌శాఖ అధికారులకు కూడా సమాచారం అందించి ఎలాంటి ప్రమాదం జరగకుండా చూశారు. అగ్నిమాపక సిబ్బంది సంఘటన స్థలానికి వెళ్లి మంటలను అదుపుచేశారు.

విద్యార్థులకు బస్ పాస్‌ల జారీకి ఏర్పాట్లు

విజయనగరం టౌన్: విద్యార్థులకు బస్ పాస్‌ల జారీకి ఏర్పాట్లు పూర్తి చేసినట్లు జిల్లా ప్రజా రవాణాధికారి సిహెచ్.అప్పలనారాయణ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. విజయనగరం, ఎస్.కోట బస్‌స్టేషన్ల వద్ద ఉన్న కౌంటర్లు ఉదయం 8 నుంచి సాయంత్రం 5 వరకూ పని చేస్తాయన్నారు. విద్యా సంస్థల ధ్రువీకరణ చేసిన సర్టిఫికెట్ అందజేయాలన్నారు. ఈ అవకాశాన్ని విద్యార్థులందరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

కన్నవారింటికి అమ్మవారు

- ముగిసిన బురదల పోలమ్మ సంబరాలు
- వేలాదిగా తరలివచ్చిన భక్తజనం



అగ్గి పూజలు చేస్తున్న పూజారి



ఆకట్టుకున్న పులివేషాలు



ప్రత్యేక అలంకరణలో గ్రామదేవత బురదల పోలమ్మ

రాయగడ: గత తొమ్మిది రోజులుగా కొనసాగిన గ్రామదేవత బురదల పోలమ్మ సంబరాలు బుధవారంతో ముగిసాయి. ఉత్సవ కమిటీ అధ్యక్షుడు బార్జి జగన్‌మోహన్‌నాయుడు, కార్యదర్శి ఎద్దు శ్రీహరి, కోశాధికారి బొత్స శ్రీనివాసరావు ఆధ్వర్యంలో జరిగిన ఉత్సవాలు అంబరాన్నంటాయి. ఉత్సవాల సందర్భంగా స్థానిక మెయిన్ రోడ్డు వద్ద తాత్కాలికంగా ఏర్పాటు చేసిన ఉత్సవ వేదిక నుంచి అమ్మవారిని కన్నవారింటికి గ్రామస్తులు దిగబెట్టడంతో ఉత్సవాలు ముగిశాయి. ముందుగా అమ్మవారి ప్రతిరూపాలుగా కొలిచే ఘటాలను ఉత్సవ వేదిక నుంచి ఆదివాసీ సంప్రదాయ వాయిద్యాల నడుమ తీసుకువచ్చారు. మరోసారి ఊయలాట, అంజలి రథంపై ఊరేగించారు. గ్రామస్తుల ఆదరణ, వారి భక్తికి పారవశ్యమైన అమ్మవారు.. మళ్లీ వచ్చే ఏడాది తిరిగి వస్తానని పలికారు. యథావిధిగా గ్రామాన్ని అన్ని విధాల కాపాడేందుకు తాను ఉంటానని అభయమిచ్చారు.

అగ్నిపూజలు, మల్లెలు తొక్కుట..

అమ్మవారిని కన్నవారింటికి దిగబెట్టే కార్యక్రమంలో భాగంగా(ముగింపు ఉత్సవాలు) పూజారి ముందుగా అగ్నిపూజ చేసి, అగ్నిదేవుని ఆహ్వానించారు. అనంతరం కర్రలు పెట్టి మంట చేశారు. మండే నిప్పులపై పూజారి, పేరంటాలు, ఆదివాసీ డప్పులు వాయిద్యకారులు నడిచారు. ఈ ఘట్టాన్నే మల్లెలు తొక్కడంగా పిలుస్తారు. దీనికి తిలకించేందుకు భక్తులు భారీగా తరలివచ్చారు.

అంజలి రథంపై అమ్మవారు..

వ్యవసాయానికి అనుకూలంగా వాతావరణం అనుకూలించి, పంటలు సమృద్ధిగా పండాలని కోరుతూ గ్రామస్తులు అమ్మవారి ప్రతీకలుగా నిలిచే ఘటలను ఎడ్లబండి చక్రంపై ఉంచి తిప్పుతారు. దీనిని అంజలి రథంగా పిలుస్తారు. ఇలా చేస్తే పంట పొలాలు చదును, దుక్కులు సమయంలో ఎటువంటి ఆటంకం కలగదన్నది నమ్మకం. ఈ సంప్రదాయాన్ని కొనసాగించారు.

కన్నవారింటికి దిగబెట్టడం..

సంబరాలు చేస్తామని గ్రామస్తులు అమ్మవారిని 2రోజుల క్రితం తన కన్నవారింటి నుంచి ఆహ్వానించి తీసుకు రాగా, సంబరాలు అనంతరం తిరిగి దిగబెట్టారు. ఈ క్రమంలో ఘటాలను మందిరానికి తీసుకువెళ్లి, నిమజ్జనం చేయడంతో ఉత్సవాలు సంప్రదాయంగా ముగిసాయి. ముగింపు రోజు పట్టణానికి చెందిన వివిధ స్వచ్ఛంద సంస్థలు సంబరాలకు వచ్చే భక్తుల కోసం మజ్జిగ, పులిహోర, కర్బూజ వంటివి పంపిణీ చేశారు.

ఆకట్టుకున్న పులివేషాలు..

ఉత్సవాల ముగింపును పురస్కరించుకుని ఏర్పాటు చేసిన పులివేషాలు ఆకట్టుకున్నాయి. అమ్మవారి మందిరం నుంచి ప్రారంభమై పురవీధుల్లో ఈ వేషాలు తమ విన్యాసాలతో అలరించారు. పట్టణం పండగ వాతావరణం బుధవారం సందడిగా కనిపించింది. అంతా అమ్మవారి మొక్కుబడులను తీర్చుకున్నారు. ఈ సందర్భంగా కొంతమంది ఇంటిలో నిలిపిన ప్రతి ఘటాలను అమ్మవారి మందిరానికి తీసుకువచ్చి నిమజ్జనం చేశారు. తమ బంధువులు, మిత్రులను ఆహ్వానించి పండగను ఘనంగా జరుపుకొని ఆనందించారు.



పులిహోర పంచుతున్న స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు



నిప్పులపై నడుస్తున్న పూజారులు



మందిరానికి తీసుకు వెళ్తున్న ఘటాలు



ఉత్సవాల ముగింపు సందర్భంగా తరలివచ్చిన భక్తులు

పెళ్లింట పెనువిషాదం



ఆస్పత్రిలో చికిత్స సూర్యారావు మృతదేహం

రాజాం సిటీ: అంగరంగ వైభవంగా పెళ్లి తంతు ముగించాలని అంతా ఏర్పాట్లు చేసుకుంటున్న ఆ ఇంట పెనువిషాదం నెలకొంది. బంధుమిత్రుల సందడి, పెళ్లి బాజాలు మోగాల్సిన ఆ ఇంట చావు డప్పు మోగింది. ఈ విషాదంపై స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. స్థానిక వాసవీ థియేటర్ ఎదురుగా ఉన్న వీధిలో నివాసం ఉంటున్న వజ్జపర్తి సూర్యారావు (26)కు బుధవారం రాత్రి 12.55 గంటలకు పెళ్లి జరగాల్సి ఉంది. అయితే బుధవారం వేకువజామున 4.30 గంటల ప్రాంతంలో రెండంతస్తుల డాబాపై నుంచి ప్రమాదవశాత్తు మరో డాబాపై జారి పడిపోవడంతో తీవ్రగాయాలపాలయ్యాడు. గమనించిన కుటుంబసభ్యులు, స్థానికులు హుటాహుటిన ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో అక్కడి నుంచి శ్రీకాకుళంలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందాడు. దీంతో వరుని కుటుంబంతోపాటు వధువు కుటుంబంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

20 ఏళ్లుగా నూడిల్స్ షాపులో పనిచేస్తూ..

బలిజిపేట మండలం పెదపెంకి గ్రామానికి చెందిన వజ్జపర్తి సూర్యారావు సోదరుడు శ్రీనివాసరావుతోపాటు బతుకుతెరువు నిమిత్తం 20 ఏళ్ల క్రితం రాజాం వచ్చి ఓ నూడిల్స్ పాయింట్‌లో పనిచేస్తున్నాడు. ఇద్దరూ కష్టపడి పనిచేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. నాలుగేళ్ల క్రితం సోదరుడు శ్రీనివాస రావు వివాహం చేసుకోగా రాజాంలో ఇంటి నిర్మాణం కూడా చేపట్టారు. అయితే ఇద్దరికీ ఇళ్లు ఉండాలన్న ఉద్దేశంతో ఇంటిపైనే మరో ఇంటి నిర్మాణం చేపట్టారు. మూడు నెలల క్రితం సూర్యారావుకు పెళ్లి సంబంధం కుదరడంతో పెళ్లి సందడితో ఉన్న ఆ కుటుంబంలో పెళ్లి కుమారుడి మృతితో తీవ్ర విషాదం నెలకొంది.

ఐఈఆర్‌పీ సిబ్బందికి రిక్వెస్ట్ బదిలీలు

విజయనగరం పూల్‌బాగ్: జిల్లాలోని 34 మండలాల్లో గల భవిత కేంద్రాల్లో పని చేస్తున్న ఐఈఆర్‌పీ సిబ్బందికి రిక్వెస్ట్ ట్రాన్స్‌ఫర్ ఆన్ హ్యూమనిటరిన్స్ గ్రౌండ్స్ ప్రాతిపదికన దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సమగ్రశిక్ష ఏపీసీ బి.లింగేశ్వరరెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తు చేయదలచిన అభ్యర్థులు ఈ నెల 8వ తేదీ నుండి 9వ తేదీ వరకు మాత్రమే స్వయంగా సమగ్రశిక్ష కార్యాలయంలో మ్యూచువల్ ట్రాన్స్‌ఫర్స్ పూర్వపు జిల్లాలో మాత్రమే పరిగణించబడుతుందన్నారు.

జాబ్ మేళా రేపు

చీపురుపల్లి: పట్టణంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో రాష్ట్ర స్కిల్ డవలప్‌మెంట్ నేతృత్వంలో ఈ నెల 9న జాబ్‌మేళా నిర్వహించనున్నట్టు ఆ పాఠశాల హెచ్‌ఎం శ్యామల సాయి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. దాదాపు 18 పరిశ్రమలు ఈ జాబ్ మేళా నిర్వహించనున్నట్టు పేర్కొన్నారు. ఉదయం 9 గంటలకు జాబ్‌మేళా ప్రారంభమవుతుందని తెలిపారు.

బాలకార్మికుల నిర్మూలనపై చైతన్య ర్యాలీ



చైతన్య ర్యాలీ ప్రారంభిస్తున్న కలెక్టర్ లింగరాజ్ పండా

పర్లాకిమిడి: జిల్లాలో బాల కార్మికుల నిర్మూళనకు చైతన్య రథాలను కలెక్టర్ లింగరాజ్ పండా బుధవారం జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాలకార్మికుల సమాచారాన్ని హెల్ప్‌లైన్ నంబర్ 155368 లేదా చైల్డ్‌లైన్ 1098కు సంప్రదించాలని సూచించారు. కాశీనగర్, గుమ్మా, మున్సిపల్ పరిధిలోని ప్రజలను చైతన్యపరిచేందుకు ఈ వాహనాలు పర్యటించనున్నాయని తెలిపారు. జిల్లాలో 14ఏళ్ల లోపు బాల, బాలికలను తీవ్రమైన పనుల్లో వినియోగిస్తే నిందితులకు రూ. 50 వేల జరిమాన విధిస్తామని జిల్లా శ్రామిక, ఉపాధి అధికారి లోకనాథ పండా హెచ్చరించారు. అలాగే రెండేళ్ల వరకు జైలు శిక్ష విధించాల్సి ఉంటుందన్నారు. అనంతరం ప్లకార్డులు చేతపట్టి, పర్లాకిమిడి కొత్తబస్టండ్ వరకు ర్యాలీ చేపట్టారు. కార్యక్రమంలో డీసీపీయూ అరుణ్‌కుమార్ త్రిపాఠి, సహాయ లేబర్ అధికారి సోమనాథ్ పాత్రొ, చైల్డ్‌లైన్ సభ్యులు రబీంద్రకుమార్ పండా తదితరులు పాల్గొన్నారు.

ఆహా ఏమి రుచి

'ఆహా ఏమి రుచి.. ఔరా... మైమరచి...' అంటూ ఓ సినీ గాయకుడు పాడినట్టు మన్యం తాండ్ర మహా రుచులను అందిస్తోంది. దీన్ని ఆరగిస్తున్న వారు ఏమి రుచంటూ ఆస్వాదిస్తున్నారు.

- మన్యం తాండ్ర మహా రుచి
- కొండ మామిడి పండ్లతో తయారీ
- కిలో రూ.150 నుంచి 200ల మధ్య విక్రయం
- అంబుల్లి అదే రుచి
- బుట్ట రూ.300 నుంచి 400ల వరకు అమ్మకాలు
- వారపు సంతల్లో విక్రయాలు



మామిడి పండ్ల రసం తీస్తున్న గిరిజనుడు



తాండ్రను ఎండలో ఆరబెట్టిన గిరిజనులు

సీతంపేట: మన్యంలోని అటవీ ప్రాంతంలో లభించే మామిడి పండ్లతో తయారు చేసే తాండ్ర తింటే మహారుచిగా ఉంటుంది. గిరిజన మహిళలు సంప్రదాయబద్ధంగా తాండ్రను తయారు చేస్తున్నారు. దీంతో మన్యం తాండ్రకు మంచి గిరాకి నెలకొంది. గిరిజన గ్రామాల్లో ప్రస్తుతం ఇళ్ల ముందు చేటలు, చాపలు, ప్లేట్లతో మామిడి తాండ్ర తయారు చేసే పనుల్లో గిరిజనులు నిమగ్నమయ్యారు. వారపు సంతలో తాండ్ర కిలో రూ.150 నుంచి 200ల వరకు విక్రయిస్తున్నారు. మామిడి పండ్ల సీజన్ అయిపోయినా తాండ్రను భద్రపరుచుకొని తినే అవకాశం ఉండడంతో దీనికి డిమాండ్ నెలకొంది.

సహజ సిద్ధంగా తయారీ...

మన్యంలో గిరిజన గ్రామాలకు ఆనుకుని ఉన్న కొండ అటవీ ప్రాంతాల్లో మామిడి చెట్లకు కాసే కొండ మామిడి పండ్లను ఇంటిల్లిపాది ఉదయం, సాయంత్రం సమయాల్లో వెళ్లి సేకరించి వాటిని శుభ్రపరిచి పెద్ద డబ్బాలు, బిందెలలో వేసి రోకలితో దంచుతారు. దంచగా వచ్చిన మామిడి రసాన్ని చేటలు, ప్లేట్లు, చాపలలో పలచగా వెదజల్లేలా ఆరబెడతారు. వీటిలో ఎటువంటి రసాయినాలు కలపకుండానే పొరలు, పొరలుగా వేసి వారం, పది రోజులు ఆరబెట్టి తాండ్రను తయారు చేస్తారు.

అంబుల్లి అదుర్స్

మామిడి పండ్లను కోసి వాటి తొక్కలను, టెంకలను వేరు చేసి ఎండబెడతారు. తొక్కలను కొందరు కారంతో, మరికొందరు బెల్లంతో కలిపి ఎండబెడతారు. బాగా ఎండిన తర్వాత వీటిని డబ్బాలలో నిల్వ చేసి తింటారు. వీటిని అంబుల్లి అంటారు. మైదాన ప్రాంతాల్లో వీటికి కూడా మంచి డిమాండ్ ఉంది. బుట్టలు లెక్కన విక్రయిస్తారు. ఒక్కో బుట్ట అంబుల్లి రూ.400ల వరకు విక్రయిస్తారు. మైదాన ప్రాంత వాసులు తీపి ఆవకాయ మాదిరిగా తయారు చేసి తింటారు.

తయారీ కష్టమే..



తాండ్ర తయారీ చేయడం చాలా కష్టమైన పని. కొండ ప్రాంతాల్లో ఉన్న పుల్లని మామిడి పండ్లను మాత్రమే దీనికి వినియోగిస్తాం. ఇంటిల్లపాది మామిడి పండ్లను కోసి వాటి తొక్కలను తీసివేసి రసాన్ని ఆరబెట్టి తాండ్ర రూపంలో తయారు చేస్తాం. అలాగే తొక్కలను ఎండబెట్టి అంబుల్లి తయారు చేస్తాం. ఇది కూడా రుచిగానే ఉంటుంది.

– ఎస్.బూదమ్మ, వలగజ్జిగూడ

మార్కెట్‌లో ధర తక్కువ



మార్కెట్‌లో ధరలు తక్కువగా ఉంటున్నాయి. ఎప్పుడూ ఒకే ధరకు విక్రయించాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. గతేడాది కూడా ఇవే ధరలు ఉన్నాయి. ఇప్పుడు కూడా మార్పు లేదు. మేం అమ్మగా మిగిలినది మా ఇంటి అవసరాలకు వినియోగించుకుంటాం.

– బాపయ్య, జోనగ దీసరిగూడ

విద్యతో సమూల మార్పులు

- రాయగడలో 5టీ కార్యదర్శి పాండ్యన్ పర్యటన
- ధార్మిక సంస్థలకు నిధులు మంజూరు చేస్తామని హామీ



వివిధ వర్గాల నుంచి వినతులు స్వీకరిస్తున్న వీకే పాండ్యన్



5టీ కార్యదర్శితో మాట్లాడుతున్న విద్యార్థులు

రాయగడ: విద్య మనిషి జీవితాన్నే మార్చి వేస్తోందని, దీని ద్వారా సమాజంలో గణనీయమైన మార్పు తీసుకు రావచ్చని రాష్ట్ర 5టీ కార్యదర్శి వీకే పాండ్యన్ అన్నారు. రాయగడలో బుధవారం నాడు పర్యటించిన ఆయన.. సాయంత్రం 5.15 గంటలకు స్థానిక గోవింద చంద్రదేవ్ ఉన్నత పాఠశాల మైదానంలో ప్రత్యేక హెలీక్యాప్టర్‌లో చేరుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ స్వాధాదేవ్ సింగ్, దక్షిణాంచల్ రేంజ్ డీఐజీ చరణ్‌సింగ్ మీనా, జిల్లా ఎస్పీ వివేకానంద శర్మ తదితరులు ఘనంగా స్వాగతం పలికారు. ముందుగా మున్సిపాలిటీ కార్యాలయం ప్రాంగణంలోని బిజూ పట్నాయక్ ఆడిటోరియంలో విద్యార్థులతో సమావేశమై, విద్యార్థులతో సమావేశమయ్యారు. సాధారణ ప్రభుత్వ పాఠశాలలో చదువుకున్న తాను.. నేడు ఐఏఎస్ అధికారిగా, 5టీ కార్యదర్శిగా ప్రజలకు సేవలు అందిస్తున్నానని తెలిపారు. ఇది తానే నమ్మలేని నిజమని, శ్రద్ధగా చదువుకుంటే ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చని హితవు పలికారు.

విద్యావిధానంపై ప్రత్యేక శ్రద్ధ..

మెరుగైన విద్యావిధానాన్ని అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని 5టీ కార్యదర్శి పాండ్యన్ అన్నారు. ఇప్పటికే 5టీ పథకంలో అంతర్భాగమైన పాఠశాలలను ఆధునీకరించామన్నారు. అదేవిధంగా త్వరలో ఉన్నత పాఠశాలలు, కళాశాలలను పథకంలో చేర్చి, మరింత అభివృద్ధి పరచడంతో పాటు విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేందుకు ప్రభుత్వం యోచిస్తోందని తెలిపారు. స్మార్ట్ తరగతులు, కంప్యూటర్ విద్య, ఆధునిక విద్యావిధానం అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుందన్నారు. డిసెంబర్ నాటికి జిల్లాలోని అన్ని కళాశాలలు, ఉన్నత పాఠశాలలను అభివృద్ధి పరుస్తామని హామీ ఇచ్చారు.

క్రీడాకారులకు ప్రోత్సాహం..

రాష్ట్రప్రభుత్వం క్రీడారంగానికి పెద్దపీట వేస్తోందని పాండ్యన్ అన్నారు. రాయగడ లోని అంబాగుడలో నూతనంగా నిర్మించిన ఇండోర్ స్టేడియాన్ని పరిశీలించిన ఆయన.. ఇంతపెద్ద ఇండోర్ స్టేడియం ఏర్పాటు కావడం శుభ పరిణామమన్నారు. అనంతరం కొంతమంది క్రీడాకారులతో సమావేశమయ్యారు. వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. క్రీడారంగంలో ఆసక్తి గలవారు ఆయా రంగంలో ముందడుగు వేయాలన్నారు. దీనికి ప్రభుత్వం కూడా అండగా ఉంటుందని హామీ ఇచ్చారు.

ధార్మిక సంస్థలకు శుభవార్త..

ఇండోర్ స్టేడియం ప్రాంగణంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వీకే పాండ్యన్ పాల్గొన్నారు. ప్రజలు ఇచ్చిన వినతులను స్వీకరించారు. తన చేయి మొత్తం వినతి పత్రాలతో నిండిపోయి.. బరువుగా మారిందని చలోక్తులు విసిరారు. కానీ ఇవి ప్రజల సమస్యలని, వాటిని నెరవేర్చడం తమ బాధ్యతతో పాటు త్వరలో పరిష్కరించేందకు తగు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అలాగే జిల్లాలోని మందిరం, మసీద్, క్రైస్తవ ప్రార్థనాలయాలు వంటి ధార్మిక సంస్థలకు సంబంధించి వాటిని అభివృద్ధి పరిచేందుకు ప్రభుత్వం శ్రద్ధ తీసుకుంటుందని తెలిపారు. ధార్మిక సంస్థల అభివృద్ధికి నిధులు కేటాయిస్తామన్నారు. మరో వారం పది రోజుల్లో శుభవార్త వింటారని ప్రకటించడం స్థానికులను ఆనందంలో ముంచెత్తింది.

రూపురేఖలు మారుస్తాం..

ఆంధ్ర, ఒడిశా ప్రజల ఆరాధ్యదైవంగా పూజలందుకుంటున్న స్థానిక మజ్జిగౌరి మందిరాన్ని 5టీ కార్యదర్శి సందర్శించారు. రాజ్యసభ మాజీ ఎంపీ నెక్కంటి భాస్కరావు, తహసీల్దార్ తపస్ రౌత్, మందిరం ట్రస్ట్ సభ్యులు ఆయనకు ఘనస్వాగతం పలికారు. అనంతరం అమ్మవారి ఆశీర్వాదాన్ని తీసుకున్నారు. ఈ సందర్భంగా కాసేపు ప్రజలతో ముచ్చటించారు. ఇప్పటి వరకు రైల్వేస్థలంలో ఉన్న మందిరం ప్రాంగణం రైల్వే ఆధీనం నుంచి ప్రభుత్వానికి వచ్చిందని తెలిపారు. త్వరలో ఈ స్థలాన్ని ప్రభుత్వం మందిరానికి విరాళంగా అందిస్తుందన్నారు. తాను మరోసారి అమ్మవారి దర్శనానికి వచ్చినప్పుడు మందిరం రూపురేఖలు పూర్తిగా మారిపోయేలా చర్యలు తీసుకుంటామని భరోసా ఇచ్చారు. దీనికి అవసరమయ్యే నిధులు ప్రభుత్వం మంజూరు చేస్తుందని, భక్తులకు మెరుగైన సౌకర్యాలు అందించే అవకాశం కల్పిస్తామని వివరించారు.

నేడు బిసంకటక్‌లో..

పాండ్యన్ గురువారం జిల్లాలోని బిసంకటక్ సమితి నియమగిరి పర్వత ప్రాంతాల్లో ఉన్న డొంగిరియా ప్రాంతాల్లో పర్యటించనున్నారు. వారి జీవన విధానం, ప్రభుత్వం మంజూరు చేసిన నిధులు వారి ఆర్థిక, సామాజిక రంగాల అభివృద్ధికి తోడ్పడే విధానాన్ని పరిశీలిస్తారు. అనంతరం చాటికోన శైవక్షేత్రాన్ని సందర్శన, గుణుపూర్ సబ్ డివిజన్‌లోని పుటాసింగిలో లంజియా తెగ ఆదివాసీలతో సమావేశం కానున్నారు. మరోవైపు రాయగడ పర్యటనలో భాగంగా 5టీ కార్యదర్శి పాండ్యన్‌ను చూసేందుకు వచ్చిన ప్రజలు అతనితో సెల్ఫీలు దిగేందుకు ఆసక్తి చూపారు. దీనికి ఆయన కూడా సహకరించి, వారితో మమేకమయ్యారు.

క్లుప్తంగా

రేపటి నుంచి జిల్లా స్థాయి కబడ్డీ పోటీలు

వజ్రపుకొత్తూరు: నీలమ్మతల్లి గ్రామదేవత ఉత్సవాల సందర్భంగా వజ్రపుకొత్తూరు మండలం దుక్కవానిపేటలో ఈ నెల 9 నుంచి జిల్లా స్థాయి కబడ్డీ పోటీలు నిర్వహిస్తున్నట్లు కమిటీ సభ్యులు ఒక ప్రకటనలో తెలిపారు. రూ.20వేలు, రూ.15వేలు, రూ.10వేలు చొప్పున నగదు బహుమతులు అందజేస్తామని పేర్కొన్నారు. ఆసక్తి గల జట్లు 9866545718, 9502996217 నంబర్లకు సంప్రదించి పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు.

విద్యార్థులకు బస్సుపాస్‌లు జారీ


విజయ్‌కుమార్

శ్రీకాకుళం అర్బన్: ఏపీఎస్ ఆర్టీసీ సామాజిక బాధ్యతగా విద్యార్థులకు వివిధ రకాల బస్ పాసులు అందిస్తున్నట్లు జిల్లా ప్రజారవాణా అధికారి ఎ.విజయకుమార్ బుధవారం తెలిపారు. చదువుకునే పిల్లలు అందరికి 10వ తరగతి వరకు ఉచిత బస్సు పాస్ సౌకర్యం కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. విద్యార్థులు నివాసం నుంచి 20 కి.మీ పరిధి వరకు బస్‌పాస్ పొందవచ్చునన్నారు. ఫొటో, స్కూల్ యాజమాన్యం ధ్రువీకరణ పత్రం దరఖాస్తుకు జతపరచాలని సూచించారు. పాస్ ఐడెంటిటీ కార్డు జారీ నిమిత్తం రూ.50 చెల్లించాల్సి ఉంటుందని పేర్కొన్నారు.

రాయితీ పాస్‌లు సైతం..
చదువుకునే ప్రతి విద్యార్థీ రాయితీ బస్ పాస్ పొందటానికి అర్హులని విజయకుమార్ పేర్కొన్నారు. ఇందుకోసం 1/3 వంతు చార్జీ చెల్లిస్తే సరిపోతుందని తెలిపారు. నివాసం నుంచి 50 కి.మీ పరిధి వరకు పాస్ పొందవచ్చన్నారు. ఒఫొటో, కాలేజీ యాజమాన్యం ధ్రువీకరణ పత్రం సమర్పించాలన్నారు. నెల, మూడు నెలలు, సంవత్సరం కాల వ్యవధితో పాసులు పొందవచ్చునని పేర్కొన్నారు. ఐడెంటిటీ కార్డు జారీ నిమిత్తం నెలవారీ పాస్‌కు రూ.50, మూడు నెలలు, ఏడాదికి రూ.100 చెల్లించాల్సి ఉంటుందన్నారు. పూర్తి వివరాలకు డిపో మేనేజర్లు, అసిస్టెంట్ మేనేజర్లను సంప్రదించాలని సూచించారు.

మార్కెట్లోకి హోండాషైన్ 100 సీసీ బైక్


మొదటి కొనుగోలుదారునికి తాళం అందిస్తున్న లలితహోండా షోరూం డైరెక్టర్ కృష్ణారావు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): జిల్లా మార్కెట్‌లోకి అతి తక్కువ ధరకే హోండాషైన్ 100 సీసీ బైకును విడుదల చేసినట్లు లలితా హోండా డైరెక్టర్ ఆకుల కృష్ణారావు తెలిపారు. శ్రీకాకుళం నగరంలోని పెద్దపాడు రోడ్డులో లలితా హోండా షోరూంలో బుధవారం మొదటి కొనుగోలుదారునికి బైకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అత్యధిక మైలేజ్, అద్భుత టెక్నాలజీతో తయారుచేసిన షైన్ బైక్‌ను అనువైన ధరకే మార్కెట్‌లోకి తీసుకొచ్చామన్నారు. కార్యక్రమంలో లలితా హోండా మేనేజింగ్ డైరెక్టర్ ఆకుల ప్రదీప్, జనరల్ మేనేజర్ రాజేష్, స్వామి, మహేష్ పాల్గొన్నారు.

9లోగా బదిలీలకు దరఖాస్తు చేసుకోవాలి

శ్రీకాకుళం న్యూకాలనీ: ఉపాధ్యాయ బదిలీల్లో భాగంగా జిల్లాలో పనిచేస్తున్న ఒకేషనల్ ఇన్‌స్ట్రక్టర్లు, ఆర్ట్స్, డ్రాయింగ్, డబ్ల్యూ ఎంటీఐ, మ్యూజిక్ టీచర్లు ఈ నెల 9లోగా ట్రాన్స్‌ఫర్‌ల కోసం దరఖాస్తు చేసుకోవాలని జిల్లా విద్యాశాఖాధికారి డాక్టర్ ఎస్.తిరుమల చైతన్య బుధవారం ఒక ప్రకటనలో కోరారు. బదిలీల ఫార్మాట్‌లో అప్లికేషన్‌ను సంబంధిత ప్రధానోపాధ్యాయులతో ధ్రువీకరింపజేసి డీఈఓ కార్యాలయంలో అందజేయాలని సూచించారు. తప్పనిసరి బదిలీల పరిధిలో ఉన్న (8 అకడమిక్ ఏళ్లు పూర్తయిన) టీచర్లు విధిగా దరఖాస్తు చేసుకోవాలని స్పష్టంచేశారు. మిగిలిన వారు ఐచ్ఛిక బదిలీ కోరుకుంటే దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు.

శ్రీకాకుళం న్యూకాలనీ: ఉమ్మడి శ్రీకాకుళం జిల్లాలోని 38 మండలాల్లో ఉన్న మండల సహిత విద్యా కేంద్రాలలో పనిచేస్తున్న రిసోర్స్ పర్సన్స్ ఫర్ ఐడబ్ల్యూఎస్‌ఎన్ (ఐఈఆర్‌పీలు)లను రిక్వెస్ట్‌పై బదిలీ చేసేందుకు ప్రభుత్వం సమ్మతించిందని సమగ్రశిక్ష ఏపీసీ డాక్టర్ రోణంకి జయప్రకాష్ తెలిపారు.

డ్రైవర్ నిర్లక్ష్యంతో వృద్ధుడి మృతి

విజయనగరం క్రైమ్: పట్టణంలోని పద్మావతినగర్‌లో బుధవారం లారీ డ్రైవర్ నిర్లక్ష్యంతో ఓ వృద్ధుడు మృతిచెందాడు. శ్రీకాకుళం జిల్లా గార మండలానికి చెందిన కె.అప్పన్న (63) స్థానిక ఆరోలైన్‌లో ఇంటి పనికి కూలీగా ఆరు నెలలుగా వెళ్తున్నాడు. ఈ క్రమంలో పని పూర్తి చేసుకుని మంగళవారం రాత్రి భవనం ఎదురుగా ఉన్న ఇసుక తిన్నెపై పడుకున్నాడు. బుధవారం వేకువజామున ఇసుక లోడ్‌తో వచ్చిన లారీ డ్రైవర్ వృద్ధుడిని గమనించక రివర్స్‌లో ఢీకొట్టాడు. దీంతో అప్పన్న అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడి భార్య చిట్టెమ్మ ఫిర్యాదు మేరకు టూటౌన్ ఎస్సై షేక్ శంకర్ కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

సిక్కోలుకే గురుతర బాధ్యత

- కరదీపికల రచయితల్లో జిల్లా ఉపాధ్యాయులు
- శిక్షణ ప్రణాళిక, కరదీపికల రూపకల్పన
- ఇప్పటికే రెండు విడతల శిక్షణ పూర్తి
- మూడో విడత శిక్షణకు శ్రీకారం


ఉపాధ్యాయులకు మెలకువలు వివరిస్తున్న రిసోర్సుపర్సన్‌లు, రచయితలు

వజ్రపుకొత్తూరు: కవులు, కళాకారులు, సాహితీవేత్తలకే కాదు.. పాఠ్య పుస్తక రచయితలకు సైతం సిక్కోలు పేరుగాంచింది. ముఖ్యంగా ఉపాధ్యాయుల వృత్యంతర శిక్షణకు అవసరమైన కరదీపికలు రచించి గురువులకే గురువులై రాష్ట్రమంతా శిక్షణ ఇస్తున్నారు. తెలుగు, ఆంగ్లం, పరిసరాల విజ్ఞానం, గణితం వంటి పాఠ్యాంశాల్లో శిక్షణ ప్రణాళిక, కరదీపికల రూపకల్పనకు పాఠశాల విద్యాశాఖ, ఎన్‌సీఈఆర్‌టీలు సంయుక్తంగా గార మండలం వమరవల్లి డైట్ కళాశాల అప్పగించాయి. దీంతో మన జిల్లా ఉపాధ్యాయులు వమరవల్లిలో ఈ ఏడాది ఏప్రిల్ 21 నుంచి 26 వరకు నిర్వహించిన కార్యశాలలో ఐదు సబ్జెక్టులకు సంబంధించిన కరదీపికలకు రచన చేశారు. ఇవి రాష్ట్రంలో నూతనంగా ఎంపికైన 1998, 2008, 2018 డీఎస్సీ ఉపాధ్యాయులకు ఎంతగానో ఉపయోగపడనున్నాయి.

బోధనకు దిక్సూచీలు కరదీపికలు..
ప్రభుత్వం ఆంగ్ల మాధ్యమానికి ప్రాధాన్యం ఇచ్చి ప్రాథమిక స్థాయి నుంచే ఆంగ్ల బోధన ఉన్న నేపథ్యంలో సిక్కోలు మాస్టార్లు రచించిన కరదీపికలు రాష్ట్రమంతా ప్రకాశిస్తున్నాయి. తెలుగు, ఆంగ్లం, పరిసరాల విజ్ఞానం, గణితం లాంటి ఉపాధ్యాయ కరదీపికలు ఒక్కొక్కదాన్ని ఆరుగురు చొప్పున విషయ నిపుణులు తయారు చేశారు. సబ్జెక్టుకు ఇద్దరు చొప్పున డైట్ అధ్యాపకులు సమన్వయకర్తలుగా వ్యవహరించారు. కరదీపికల్లో చేతిరాత, వ్యాకరణంపై అవగాహన, బోధనోపకరణాల ప్రాముఖ్యాన్ని దృష్టిలో ఉంచుకుని విద్యార్థులకు సులువుగా బోధన అర్థమయ్యేలా అంశాలను పొందుపరిచారు. ఇందులో భాగంగా మే 15 నుంచి కాశీబుగ్గ, పాలకొండ, వమరవల్లి కేంద్రాలుగా మూడు విడతలుగా ప్రారంభమైన శిక్షణ కార్యక్రమంలో ఇప్పటికే రెండు విడతలు పూర్తి కాగా మూడో విడత జూన్ 2 వరకు కొనసాగింది.

క్రెడిట్ అంతా మన మాస్టార్లకే..
ఉపాధ్యాయ వృత్యంతర శిక్షణలో సిక్కోలు ఉపాధ్యాయులు తయారు చేసిన కరదీపికలనే ఉపయోగిస్తున్నారు. జిల్లాలో వివిధ సబ్జెక్టుల్లో నిపుణులైన ఉపాధ్యాయులు ఉండబట్టే ఈ బాధ్యతను ప్రభుత్వం మన జిల్లాకు అప్పగించిది. అంతేకాదు రాష్ట్రంలోని 13 జిల్లాల్లోని రిసోర్సు పర్సన్‌లకు సైతం మన జిల్లా మాస్టార్లే శిక్షణ ఇవ్వడం విశేషం. డీఎస్సీలో జిల్లా నుంచి ఎంపికైన 840 మంది ఉపాధ్యాయులకు ఇప్పటికే శిక్షణ తగతులను నిర్వహించారు.

శిక్షణ ఉపయోగపడుతోంది



నూతనంగా ఉద్యోగంలో చేరిన నాకు ఈ శిక్షణ చాలా ఉపయోగపడుతోంది. నూతన పాఠ్య పుస్తకాలను ఎలా బోధించాలో నేర్చారు. ఐదు రోజుల శిక్షణలో నాలుగు సబ్జెక్టులకు చెదిన విషయాలతో పాటు పాఠశాల నిర్వహణకు అవరమైన విషయాలు నేర్చుకున్నాను. విద్యా సంవత్సరానికి ముందే శిక్షణ ఇవ్వడం పట్ల పాఠశాల ప్రారంభం నుంచే కృత్యాధార బోధన ప్రారంభించడానికి అవగాహన కలిగింది. –బీవీఎస్ఎస్ మూర్తి, శిక్షణ పొందుతున్న ఉపాధ్యాయుడు

నైపుణ్యాలు వెలికితీయాలి..



పిల్లల్లో దాగి ఉన్న నైపుణ్యాలను వెలికితీసి వారిని సంపూర్ణ మూర్తిమత్వ అభివృద్ధికి గల బోధనాంశాలను తెలియజేసేందుకు కరదీపికలు చాలా అవసరం. విద్యాహక్కు చట్టం, పాఠశాల నిర్వహణ, పేరెంట్స్ కమిటీ, నూతన విద్యావిధానం, బహుళ తరగతుల బోధన, నిర్మాణాత్మక అభ్యసనకు బోధనోపకణాల వినియోగం వంటివి ఈ శిక్షణ ద్వారా నూతన ఉపాధ్యాయులకు తెలియజేస్తున్నాం. – ఎం.భారతమ్మ, డైట్ వైస్ ప్రిన్సిపాల్, మాడ్యుల్ రచయిత

ప్రయోగాలకు ప్రాధాన్యం..



విద్యార్థులకు చెప్పేదానికంటే చేయించడం ద్వారా ఎక్కువ జ్ఞానాన్ని పొందుతారు. అందుకు ప్రాథమిక స్థాయి పిల్లలకు ప్రయోగాలు చేయడం, బొమ్మలు వేయించడం, కృత్యాలు నిర్వహించడంపై శిక్షణ ఇస్తాం. 11 అంశాలతో కరదీపిక తయారు చేశాం. డైట్ ప్రిన్సిపాల్ ఎస్.తిరుమల చైతన్య ఆధ్వర్యంలో జిల్లా ఉపాధ్యాయులు తయారు చేసిన కరదీపికలు రాష్ట్ర వ్యాప్తంగా ఉపాధ్యాయులకు శిక్షణ ఇవ్వడానికి ఉపయోగపడటం సంతోషంగా ఉంది. –లఖినాన వెంకటాచలం, పరిసరాల విజ్ఞానం మాడ్యూల్ రచయిత, స్టేట్ రిసోర్సుపర్సన్

ఉత్పత్తిదారుల సంఘాలు ఏర్పాటుకావాలి


మత్స్యకార సంఘ సభ్యులతో నాబార్డు డీడీఎం వరప్రసాద్

గార: మత్స్యకారులు ఉత్పత్తిదారుల సంఘాలుగా ఏర్పడితే నాబార్డు, ప్రభుత్వం ద్వారా మరిన్ని సేవలు పొందే అవకాశం కలుగుతుందని నాబార్డు జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి కె.వరప్రసాద్ అన్నారు. బుధవారం గార మండలం బందరువానిపేటలో మత్స్యకారుల ఉత్పత్తిదారుల సంఘ సభ్యులు, డైరెక్టర్లతో హెచ్‌డీఎస్‌ఏ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మోటార్లు, వలలు, డీజిల్ మొదలైన వాటికి మూలధనం లేకపోవడం, నిల్వ సౌకర్యం ఏర్పాటు చేసుకోలేకపోవడం, మార్కెట్ లింకేజి తదితర సమస్యలతో మత్స్యకారులు ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. అంతా కలిసి ఎఫ్‌పీవోగా ఏర్పడితే సమస్యలు పరిష్కరించుకోవడంతో పాటు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోగలుగుతారని వివరించారు. సంఘాలకు నాబార్డు కూడా సాయం అందిస్తుందన్నారు. కార్యక్రమంలో మత్స్యకార సంఘ నాయకులు రామారావు, హెచ్‌డీఎస్‌ఏ డైరెక్టర్ పి.వి.రమణ, సీఈవో ఎస్‌హెచ్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

కొల్లివలసలో పోలీసు బందోబస్తు


గస్తీ కాస్తున్న పోలీసులు

బూర్జ: మండలంలోని కొల్లివలసలో బుధవారం పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. గ్రామంలో జగ్గుపెల్లి వెంకటరావు, సైరిగాపు ఆనందరావు కుటుంబాల పిల్లల ప్రేమ వ్యవహారం కొట్లాటకు దారితీసిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో గ్రామంలో ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ఎస్సై బి.అశోక్‌బాబు ఆధ్వర్యంలో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. కొట్లాట జరిగిన రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు గ్రామానికి చెందిన సైరిగాపు లచ్చన్నకు చెందిన సుమారు 15 ఎకరాల గడ్డి వాముకు నిప్పంటించారు. పశువుల మేతకు ఏడాదికి సరిపడా నిల్వ చేసిన ఎండు గడ్డి తగలబెట్టడంతో బాధితులు లబోదిబోమంటున్నారు.

ఆవును ఢీకొన్న వ్యాన్

- ముగ్గురికి గాయాలు


బోల్తాపడిన వ్యాన్

ఇచ్ఛాపురం రూరల్: చేపలను తెచ్చేందుకు వెళ్తున్న బొలెరో పికప్ వ్యాన్ ఆవును ఢీకొని బోల్తా పడింది. ఈ ఘటనలో డ్రైవర్‌తో పాటు ఇద్దరు మత్స్యకార మహిళలు గాయాలపాలయ్యారు. మందస మండలం లొహరబందకు చెందిన సుమంత్ బుధవారం ఉదయం ఒడిశా రాష్ట్రం సుర్లా నుంచి చేపల లోడ్‌ను తెచ్చేందుకు జాతీయ రహదారిపై నుంచి వస్తుండగా సవరదేవి పేట వద్దకు వచ్చేసరికి అయ్యవారిపేటకు చెందిన ఆవు ఎదురుగా రావడంతో ఢీకొట్టాడు. ఈ ఘటనలో ఆవు అక్కడికక్కడే మృతి చెందగా, వ్యాన్ డ్రైవర్, అందులో ఉన్న ఇద్దరు మహిళలు గాయపడ్డారు. స్థానికులు స్పందించి బాధితులను ఇచ్ఛాపురం సామాజిక ఆసుపత్రికి తరలించారు.

కుక్కల దాడిలో వృద్ధుడికి తీవ్ర గాయాలు


తీవ్ర గాయాలపాలైన సూర్యనారాయణ

ఆమదాలవలస రూరల్: మండలంలో నిమ్మతొర్లాడలో వృద్ధుడిపై కుక్కల గుంపు ఒక్కసారిగా దాడి చేయడంతో తీవ్ర గాయాలయ్యాయి. గ్రామానికి చెందిన గుణుపూరు సూర్యనారాయణ బుధవారం మధ్యాహ్నం నాగావళి నది ఒడ్డు సమీపంలో రచ్చబండపై సేద తీరేందుకు వెళ్లాడు. అక్కడే ఉన్న కుక్కల గుంపు ఒక్కసారిగా సూర్యనారాయణపై దాడి చేయడంతో కుప్పకూలిపోయాడు. స్థానిక యువత గమనించి కుక్కల గుంపును తరిమికొట్టారు. తీవ్ర గాయాలైన సూర్యనారాయణకు సపర్యలు చేసి 108 వాహనం ద్వారా శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు. పరిస్థితి విషమించడంతో విశాఖపట్నం కేజీహెచ్‌కు తరలించాలని వైద్యులు రిఫర్ చేశారని భార్య కమలమ్మ తెలిపింది.

ఈసీసీఈ కోర్సు ప్రవేశాలకు కౌన్సెలింగ్

ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయంలో నిర్వహిస్తున్న ఎర్లీ చైల్డ్ హుడ్ కేర్ ఎడ్యుకేషన్ కోర్సు (ఈసీసీఈ)లో ప్రవేశాలకు ఈ నెల 8, 9 తేదీల్లో కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు రిజిస్ట్రార్ ప్రొఫెసర్ సీహెచ్ఏ రాజేంద్ర ప్రసాద్ చెప్పారు. వర్సిటీలో బుధవారం వివరాలు వెల్లడించారు. ఆరు నెలల వ్యవధి కోర్సును ఆన్‌లైన్ క్లాస్ వర్క్ ద్వారా నిర్వహిస్తామన్నారు. దరఖాస్తు చేసుకున్న వారు ఒరిజనల్ ధ్రువీకరణ పత్రాలతో హాజరు కావాలని చెప్పారు.

నేడు ఆదిత్యుని హుండీ కానుకల లెక్కింపు

అరసవల్లి: అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయ హుండీల్లో కానుకల లెక్కింపును గురువారం ఉదయం 8 గంటల నుంచి అనివెట్టి మండపంలో నిర్వహిస్తున్నట్లుగా ఆలయ ఈఓ వి.హరిసూర్యప్రకాష్ తెలియజేశారు. ఈ మేరకు ఆలయ పాలక మండలి సభ్యులు, రెవెన్యూ, పోలీస్ సిబ్బంది మధ్యనే హుండీలను తెరిపిస్తామని తెలిపారు.

ప్రతి విద్యార్థికి జేవీడీ కిట్లు

ఎల్.ఎన్.పేట: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న ప్రతి విద్యార్థికీ జగనన్న విద్యా కానుక కిట్లు పంపిణీ చేయాలని డీఈఓ తిరుమల చైతన్య అన్నారు. మండలంలోని కరకవలస జెడ్పీ ఉన్నత పాఠశాలలో జేవీడీ కిట్ల నిల్వ కేంద్రాన్ని ఆయన బుధవారం పరిశీలించారు. నిల్వ కేంద్రం నుంచి పాఠ్యపుస్తకాలను అన్ని పాఠశాలలకు తరలించాలన్నారు. వేసవి సెలవుల పాఠశాలలు తెరిచే రోజునే పాఠ్య పుస్తకాలతో కానుకలు కూడా అందించాలని తెలిపారు.

చెప్పారు.. చేశారు!



- క్యాబినెట్ నిర్ణయాలతో ఉద్యోగ వర్గాల్లో సంతోషం
- సీఎంకు కృతజ్ఞతలు తెలిపిన కాంట్రాక్టు ఉద్యోగులు
- కాశీబుగ్గ కిడ్నీ రీసెర్చ్ సెంటర్‌కు

శ్రీకాకుళం పాతబస్టాండ్, శ్రీకాకుళం న్యూకాలనీ, శ్రీకాకుళం: ఉద్యోగులకు ఇచ్చిన మాటను సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నిలబెట్టుకున్నారు. ఎన్నో ఏళ్లుగా అపరిష్కృతంగా ఉన్న సమస్యలను పరిష్కరించడానికి ఏపీ క్యాబినెట్ ఆమోదం తెలపడంతో ఆయా వర్గాల్లో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. ముఖ్యంగా కాంట్రాక్టు ఉద్యోగుల క్రమబద్ధీకరణ, పలాస కిడ్నీ రీసెర్చ్ సెంటర్‌కు మెడికల్ ఆఫీసర్ల నియామకం వంటివి సిక్కోలుకు ఎంతో మేలు చేస్తాయి.

ఉద్యోగుల్లో ఆనందం
జిల్లా వ్యాప్తంగా దాదాపు 15వేల మంది ఉద్యోగ, ఉపాధ్యాయులు ఉన్నారు. కంట్రిబ్యూటరీ పెన్షన్ విధానం తమకు వద్దంటూ వారు ఎంతో కాలంగా ఆందోళనలు చేస్తున్నారు. పాత పింఛన్ విధానమే కావాలంటున్నారు. దీంతో పాత పింఛన్ విధానానికి సరి సమానంగా పింఛన్ ఉండేలా ప్రభుత్వ పింఛన్ విధానం రూపొందించి అమలు చేయనున్నారు. రిటైరయ్యాక పే స్కేల్‌లో సగానికి తక్కువ లేకుండా పింఛన్ వచ్చేలా రూపకల్పన చేశారు. ఎన్నికల ముందు ఇచ్చిన మాటను నిలబెట్టుకున్నారు.

ఎన్నాళ్లో వేచిన ఉదయం..
కాంట్రాక్టు ఉద్యోగులు తమ ఉద్యోగాలను క్రమబద్ధీకరించాలని ఎన్నో ఏళ్లుగా కోరుతున్నారు. వీరి విన్నపాలు మన్నించిన ప్రభుత్వం చిరకాల స్వప్నాన్ని నెరవేర్చింది. 2014 ముందు నుంచి పనిచేస్తున్న వారికి క్రమబద్ధీకరణ చేయాలని క్యాబినెట్‌లో తీర్మానించింది. దీంతో జిల్లాలోని వైద్యారోగ్య శాఖ, రిమ్స్, పశు సంవర్ధక శాఖ, సెరీ, హర్టీకల్చర్, ఉన్నత విద్యా విభాగాల్లో ఉన్న దాదాపు 1800 మందికి మేలు జరుగుతుంది. 12వ పీఆర్సీ వల్ల కూడా జిల్లాలోని దాదాపు 40వేల మంది ఉద్యోగులకు లబ్ధి చేకూరనుంది.

రెగ్యులర్ అవుతుందనుకోలేదు..



ఇరవై ఏళ్లుగా వైద్యారోగ్య శాఖలో ఉద్యోగం చేస్తున్నాను. నాలాగే ఎంతో మంది చేస్తున్నారు. మా ఉద్యోగాలు రెగ్యులర్ అవుతాయని ఎప్పుడూ అనుకోలేదు. పాదయాత్ర సమయంలో వైఎస్ జగన్‌కు మా కష్టాలు చెప్పుకున్నాం. అప్పుడు ఇచ్చిన మాట ఇప్పుడు నిలబెట్టుకున్నారు. – డి.సాయిప్రసాద్, జిల్లా కాంట్రాక్ట్ పారా మెడికల్ సిబ్బంది అధ్యక్షుడు, శ్రీకాకుళం

మర్చిపోలేని రోజు



మా జీవితంలో ఇది మర్చిపోలేని రోజు. ఇరవై ఏళ్లుగా వైద్యారోగ్య శాఖలో పనిచేస్తున్నాను. పాదయాత్ర సమయంలో చిన్న ఉద్యోగులకు ఇచ్చిన మాటకు కట్టుబడిన జగనన్న రుణం ఎప్పటికీ తీర్చుకోలేనిది.
– సనపల కిరణ్‌కుమార్, హెల్త్ అసిస్టెంట్, ఎల్.ఎన్.పేట

సంతోషకరం



క్యాబినేట్ మీటింగ్‌లో రాష్ట్ర ప్రభుత్వం 10,117 మంది కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయడం, పలాస కిడ్నీ రీసెర్చ్ సెంటర్‌కి 41 మెడికల్ ఆఫీసర్ పోస్టులు మంజూరు చేయడం సంతోషకరం. రాబోయే పీఆర్సీ ఉద్యోగులకు అన్ని విధాలా అనుకూలంగా ఉంటుంది.
– బోనెల గోపాల్, పలాస ఏపీఎన్‌జీఓ అధ్యక్షుడు

హర్షణీయం



ఏపీ క్యాబినెట్ మీటింగ్‌లో తీసుకున్న నిర్ణయాలు హర్షణీయం. ముఖ్యంగా కొత్త ఉద్యోగాల భర్తీ, పీఆర్సీ ఏర్పాటు, పలాస కిడ్నీ రీసెర్చ్ సెంటర్‌లో మెడికల్ ఆఫీసర్ల భర్తీ వంటి నిర్ణయాలు బాగున్నాయి.
– లఖినేని కరుణాకర్, ఏపీటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు, కోటబొమ్మాళి

చారిత్రక నిర్ణయం



కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులర్ చేస్తూ సీఎం వైఎస్ జగన్ తీసుకున్న నిర్ణయం చారిత్రకం. 23 ఏళ్లుగా పనిచేస్తున్న వారి కుటుంబాల్లో వెలుగులు నింపినట్లైంది. ముఖ్యంగా విద్య, వైద్యశాఖల్లో పని చేస్తున్న అధ్యాపకులు, హెల్త్ అసిస్టెంట్లు, ల్యాబ్ టెక్నీషియన్లు, ఫార్మసిస్టులు, స్టాఫ్‌నర్సులకు ప్రయోజనం కలిగింది.
– అలుగోలు సురేష్, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ కాంట్రాక్ట్ ఉద్యోగుల ఫెడరేషన్ రాష్ట్ర సమన్వయ కర్త

సీఎంకు జీవితాంతం రుణపడి ఉంటాం..




ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి జీవితాంతం రుణపడి ఉంటాం. కాంట్రాక్ట్ ఉద్యోగులను, లెక్చరర్లను క్రమబద్ధీకరించాలని క్యాబినెట్‌లో ఆమోదముద్ర వేయడం చాలా సంతోషంగా ఉంది. త్వరితగతిన ప్రక్రియను పూర్తిచేయాలని విన్నవిస్తున్నాం.
– హనుమంతు రామ్మోహన్‌దొర(బుజ్జి), కాంట్రాక్ట్ లెక్చరర్ల జేఏసీ నేత

మాటిస్తే.. చేస్తారంతే!




సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తెగింపు, తెగువ గురించి రాష్ట్రంతోపాటు దేశం మొత్తం తెలిసిన విషయమే. ఆయన మాట ఇస్తే.. చేస్తారంతే. కాంట్రాక్ట్ ఉద్యోగులను క్రమబద్ధీకరించాలని నిర్ణయించడం ఆనందదాయకం.
– కె.రబీంద్రనాథ్ ఠాగూర్, కాంట్రాక్ట్ లెక్చరర్ల సంఘ ప్రతినిధి

సీపీఎస్ రద్దు మంచిదే



సీపీఎస్ రద్దు చేయడం మంచిదే. ప్రభుత్వం ప్రతిపాదించిన పింఛన్ విధానం స్థితిగతులు ఇంకా తెలుసుకోవాల్సి ఉంది. ప్రభుత్వం సీపీఎస్ రద్దు చేసి ఒక అడుగు ముందుకు వేయడం సంతోషం. – జి.భాస్కరరావు, టీచర్

23 ఏళ్ల కల నెరవేరింది



కాంట్రాక్ట్ ఉద్యోగులను క్రమబద్ధీకరణ చేయటం చాలా హర్షణీయం. ఇది 23 ఏళ్ల కల. ఈ జీఓను కొనసాగిస్తూ ప్రతి ఐదేళ్లకు క్రమబద్ధీకరణ చేయాలని కోరుతున్నాం.
– శ్రీనివాసరెడ్డి, రిమ్స్ ఆస్పత్రి

జగనన్న నిర్ణయం గొప్పది



కాంట్రాక్టు ఉద్యోగుల క్రమబద్ధీకరణ నిర్ణయం గొప్పది. దీని వల్ల వైద్య ఆరోగ్య శాఖలో ఎక్కువ మంది ఉద్యోగులకు ప్రయోజనం చేకూరుతుంది. ప్రభుత్వం నిర్ణయాన్ని స్వాగతిస్తున్నాం.
– వై.రాంబాబు, రిమ్స్, రేడియాలజీ విభాగం

ఉద్దానంకు వరం



- కిడ్నీ రీసెర్చ్ సెంటర్‌కు 41 మంది మెడికల్ ఆఫీసర్లు
- క్యాబినెట్ సమావేశంలో సీఎం స్పష్టీకరణ

కాశీబుగ్గ: ఏపీ క్యాబినెట్ సమావేశం ఉద్దానంపై వరాల జల్లు కురిపించింది. ఇక్కడి కిడ్నీ వ్యాధిపై యుద్ధం ప్రకటిస్తూ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పలాసలో కిడ్నీ రీసెర్చ్ సెంటర్, 200 పడకల సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి నిర్మాణానికి ముందుకు వచ్చారు. ముఖ్యమంత్రిగా పగ్గాలు చేపట్టిన ఏడాదే రూ.50 కోట్లు తొలి బడ్జెట్‌ను విడుదల చేశారు. అనంతరం కరోనా సమయంలో కాస్త ఆలస్యం అయినా ప్రస్తుతం భవన నిర్మాణం పూర్తయి వైద్య సేవలు అందించడానికి సిద్ధం చేస్తున్నారు. తాజాగా ఈ ఆస్పత్రిలో సేవలు అందించేందుకు 41 మంది మెడికల్ ఆఫీసర్లను నియమించడానికి క్యాబినెట్ ఆమోదం తెలిపింది. దీంతో కిడ్నీ రోగులతో పాటుగా ఆయా కుటుంబాలు సంతోషం వ్యక్తం చేస్తున్నాయి.

చాలా సంతోషంగా ఉంది




పలాస కిడ్నీ రీసెర్చ్ సెంటర్, సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి పనులు చేపడుతున్నప్పటికీ ఈ ప్రభుత్వం పూర్తి చేస్తుందని అనుకోలేదు. కొద్ది రోజులలో పనులు పూర్తి చేయడంతో పాటు కిడ్నీ రీసెర్చ్ సెంటర్‌కు వైద్యులను నియమించడంతో మా బతుకలపై ఆశలు పెరుగుతున్నాయి. మా ఇంట్లో నాకు రెండు కిడ్నీలు పాడైపోయాయి. నా భార్యకు ఒక కిడ్నీ పాడైపోయింది. మాకు వైఎస్సార్ పింఛన్ కానుక కిడ్నీ వ్యాధి సంబంధించి నెలకు ఒక్కొక్కరికి రూ.10వేలు చొప్పున మొత్తం రూ.20 వేలు వైద్య సేవలకు ఉపయోగపడుతున్నాయి. ఆస్పత్రి వైద్యులతో పాటు సేవల్లోకి వస్తే మరింత సంతోషం. మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజుతో పాటు ఇతర మంత్రులు ఆమోదం తెలపడం నాకు మరింత సంతోషం కలుగుతుంది.
– రాపాక అప్పలస్వామి, కిడ్నీవ్యాధిగ్రస్తుడు, మాకన్నపల్లి, పలాస మండలం

010 పద్దు ద్వారా జీతాలు

ఆంధ్రప్రదేశ్ వైద్య విధాన పరిషత్‌ను ప్రభుత్వ శాఖగా మార్చాలని క్యాబినెట్ తీర్మానించడంతో జిల్లాలో 6, 200 మంది ఉద్యోగులకు లబ్ధి చేకూరనుంది. టెక్కలి జిల్లా ఆస్పత్రితో పాటు నరసన్నపేట, సోంపేట, బారువ, ఇచ్ఛాపురం, కవిటి, హరిపురం, పలాస, పాతపట్నం, కొత్తూరు, రణస్థలం, కోటబొమ్మాళి, బుడితి, ఆమదాలవలస తదితర ప్రాంతాలలో ఉన్న ఏరియా ఆస్పత్రులు, కమ్యూనిటీ హెల్త్‌సెంటర్లు ఏపీవీవీపీ పరిధిలోకి వస్తాయి. ఇప్పటి వరకూ ఇవి సెమీ అటానమస్ విధానం ద్వారా పనిచేసేవి. ఉద్యోగులకు జీతాలు, ఆస్పత్రులకు మందులు, పరికరాలు అవసరమైతే ఆయా నిధుల కోసం ప్రభుత్వానికి నివేదించేవారు. అవి మంజూరైన తర్వాత వీటిని కొనుగోలు చేయడం, జీతాలు ఇవ్వడం వంటివి చేసేవారు. దీని వల్ల కొన్ని సార్లు జీతాల మంజూరులో జాప్యం జరిగేది. అలాగే మందులు, వైద్య పరికరాలు సరఫరాలో జాప్యం జరిగేది. ప్రస్తుతం దీన్ని ప్రభుత్వ శాఖగా మార్చడం వల్ల ఇక మీదట ఉద్యోగులకు 010 పద్దు ద్వారా జీతాలు, ఇతర భత్యాలు మంజూరవుతాయి. అలాగే ప్రభుత్వమే నేరుగా ఆస్పత్రులకు మందులు, పరికరాలు, పోస్టులను మంజూరు చేసేందుకు అవకాశం ఏర్పడింది. జిల్లాలో నడుస్తున్న ఏపీవీవీపీ ఆసుపత్రులలో 6, 200 మంది వరకూ వైద్యులు, ఇతర సిబ్బంది ఉండగా వారందరికీ ప్రయోజనం చేకూరనుంది.

ఎంతో ఉపయోగకరం



రాష్ట్ర ప్రభుత్వం ఏపీవీవీపీని ప్రభుత్వ శాఖగా మార్చడం హర్షణీయం. దీని వల్ల ఉద్యోగులు, రోగు లు ఎంతో లబ్ధిని పొందుతారు. ఇదివరకూ నిధులు మంజూరయ్యే వరకూ వేచి చూడాల్సి వచ్చేది. ఇపుడు ప్రభుత్వమే నేరుగా నిధులు, మందులు, పరికరాలు సరఫరా చేస్తుంది.
– డాక్టర్ జి.భాస్కరరావు, డీసీహెచ్‌ఎస్, శ్రీకాకుళం

సీఎంకు కృతజ్ఞతలు



కాంట్రాక్టు ఉద్యోగులపై సీఎం వైఎస్ జగన్‌కు ఉన్న చిత్తశుద్ధి మరువలేనిది. రాష్ట్రంలో సుమారు 10,117 మంది కాంట్రాక్టు ఎంప్లాయీస్‌ను రెగ్యులర్ చేస్తూ ఇచ్చిన తీర్మానం ఆనందదాయకం. గతంలో చంద్రబాబు హామీలు ఇచ్చారు గానీ అమలు చేయలేదు. వైఎస్ జగన్ మాత్రం ఇచ్చిన మాట నిలబెట్టుకున్నారు. ఆయనకు కృతజ్ఞతలు.
– జె.రవిబాబు, జేఎల్ ప్రభుత్వం జూనియర్ కళాశాల ఆమదాలవల, కాంట్రాక్టు అధ్యాపకుల అసోసియేషన్ పూర్వ ఉపాధ్యక్షులు